తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం - 20 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 166 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

ప్రతి కుటుంబానికి

5 లక్షల జీవిత బీమా..



- *ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం*
- *నవంబర్ 26 నుంచి కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరల పంపిణీ*
- *సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ పేరు.. సీఎం ప్రకటన*
- *రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం..*
- *పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు*

సిద్దిపేట:నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రజాపాలన-ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఈ పథకాన్ని ప్రారంభించారు. అలాగే నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవం నుంచి రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.ముస్తాబాద్ చౌరస్తా నుంచి ప్రజలతో కలిసి సుమారు రెండు కిలోమీటర్ల మేర పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..సిద్దిపేట శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన మదన్ మోహన్ తొలి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా సిద్దిపేట మెడికల్ కాలేజీకి మదన్ మోహన్ మెడికల్ కాలేజీగా పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు.ఇందుకు సంబంధించిన ఆదేశాలు వెంటనే జారీ చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదేశించారు.

మల్లన్నసాగర్ ప్రాజెక్టు

మిగతా 2 లో..

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు..

అవినీతి పాలన

- *సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు*
- *పెన్షన్లలో 4.70 లక్షల కోతలు.. రూ.4 వేల హామీ ఏమైంది?*
- *కాంగ్రెస్ నేతలు తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తాం: కేటీఆర్*

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, అవినీతి పాలన అని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి

చెందిన ఎమ్మెల్యేలే ప్రభుత్వంలో అవినీతి జరుగుతోందని బహిరంగంగా మాట్లాడుతున్నారని, వారి వ్యాఖ్యలతో పాలనలోని లోపాలు బయటపడుతున్నాయని అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పనులు జరగాలంటే పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందని చెబుతుండగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై రూ.5 లక్షల కోట్ల దోపిడీ, టెండర్లలో అవినీతి, కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలు చేస్తున్నారని గుర్తుచేశారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రభుత్వం నుంచి నియోజకవర్గాలకు నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. నిధుల కోసం ప్రపంచ బ్యాంకుకు అర్జీలు పెట్టుకునే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని, అందుబాటులో ఉన్న నిధులన్నీ కొడంగల్‌కు తరలిస్తున్నారని యెన్నం శ్రీనివాస్ రెడ్డి గతంలో ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తాము కేవలం పెళ్లిళ్లు, చావులకు మాత్రమే పరిమితమయ్యామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై ఆ పార్టీ నేతలే గళం విప్పుతున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని ఆరోపణలు,

మిగతా 2 లో..



మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి నాగార్జున మద్దతు

- *'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్'లో పాల్గొననున్న నటుడు*
- *నాగార్జునను కలిసి ఆహ్వానించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి*
- *నవంబర్ 25 నుంచి 27 వరకు ప్రత్యేక పాదయాత్ర*
- *అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు అవగాహన కార్యక్రమం*

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చేపడుతున్న అవగాహన ఉద్యమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున భాగస్వామి కానున్నారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో పాల్గొని తన మద్దతు అందించేందుకు ఆయన అంగీకరించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో నాగార్జునను కలిసిన కిషన్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం చేపడుతున్న ఈ సామూహిక ఉద్యమానికి నాగార్జున మద్దతు ప్రకటించడం సంతోషంగా ఉందని తెలిపారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువత' పిలుపు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజంలో వాటి దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన

మిగతా 2 లో..



సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యం

- *ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం*
- *వ్యవసాయ రంగ ప్రముఖులకు ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలు*
- *శాస్త్రవేత్తలు, పాత్రికేయుడు, రైతులకు అవార్డుల ప్రదానం*
- *ఇందిరా గాంధీ వ్యవసాయ సేవలపై పుస్తకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి*

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. సాగునీటి వసతులు మెరుగుపడితే రైతులకు భరోసా కలగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కూడా దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

వ్యవసాయ రంగంలో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ముఖ్యమంత్రి తన నివాసంలో ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలను ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఎంపిక చేసిన శాస్త్రవేత్తలు, పాత్రికేయుడు, రైతులు ఈ అవార్డులను అందుకున్నారు.వ్యవసాయ రంగంలో విభిన్న విభాగాల ద్వారా సేవలందించిన వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో ఈ పురస్కారాలను అందజేశారు. పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ ఎం. సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ ఎస్.డి. శిఖామణి వ్యవసాయ శాస్త్రవేత్తల విభాగంలో అవార్డులు అందుకున్నారు. పాత్రికేయ రంగం నుంచి ఆర్. దిలీప్ రెడ్డికి పురస్కారం లభించింది. రైతుల విభాగంలో గిరిజన రైతు లోనావత్ శాంతా బాయి, సేంద్రియ రైతు కె. లావణ్య అవార్డులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వీకరించారు. వ్యవసాయానికి తమ తమ రంగాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా వీరిని ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ వ్యవసాయ రంగ అభివృద్ధికి అందించిన సహకారం, ఆమె హయాంలో సాగు రంగంలో చోటుచేసుకున్న మార్పులపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దేశ వ్యవసాయ ప్రస్థానంలో ఇందిరా గాంధీ పాలనాకాలంలో చోటుచేసుకున్న అభివృద్ధి, రైతులకు అందించిన ప్రోత్సాహాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు.

రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, రైతులను ఒకే వేదికపై గౌరవించడం ద్వారా వ్యవసాయ రంగానికి వారి సేవలను గుర్తించినట్లయింది. వ్యవసాయ పరిశోధనలు, ఆధునిక సాగు విధానాలు, సేంద్రియ వ్యవసాయం వంటి విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించడం ఈ పురస్కారాల

మిగతా 2 లో..

కృష్ణా జలాల వాటాలో

రాజీ పడే ప్రసక్తే లేదు

- *తెలంగాణ ప్రయోజనాల కోసం 70 శాతం వాటా కోరుతున్నాం: మహేశ్‌కుమార్ గౌడ్*
- *సాగర్ నుంచి నీటి తరలింపును అడ్డుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే*
- *బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శ*
- *భూములకే కాదు.. నీటి హక్కులపైనా రాజకీయ పోరాటం*

హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రానికి 70 శాతం నీటి వాటా సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతోందని తెలిపారు. నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించే ప్రయత్నాలను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు తమ పాలనలో జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని ఆరోపించారు. కేటీఆర్ కొత్త రాజకీయ నాటకానికి తెరతీశారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అప్పట్లో 36 శాతం నీటి వాటా సరిపోతుందని కేసీఆర్ అంగీకరించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 70 శాతం వాటా కోసం పట్టుబడుతోందని వివరించారు. బీఆర్ఎస్ పాలనలో ఆంధ్రప్రదేశ్ 4,464 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, తెలంగాణకు 1,993 టీఎంసీలే దక్కాయని పేర్కొన్నారు. గతంలో అంగీకరించిన నీటి వాటా, ప్రస్తుత ప్రభుత్వ డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి తరలింపు అంశంపై కేంద్రానికి, కృష్ణా



నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు తెలిపిందని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ కేంద్రానికి లేఖలు రాశామని, తెలంగాణ అభ్యంతరాల కారణంగా ఆ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. డ్యామ్‌పై కేంద్ర

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా..

(మొదటి పేజీ తరువాయి)

ముంపునకు గురైన 14 గ్రామాల నిజమైన బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించిన అనంతరం నష్టపరిహారం అందిస్తామని వెల్లడించారు.

తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, రాష్ట్రానికి రావాల్సిన ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని స్పష్టం చేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులను గత పదేళ్లలోనే పూర్తి చేసి ఉంటే నేడు నీటి సమస్యలు ఎదురయ్యేవి కాదని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రారంభించిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని తమ ప్రభుత్వం రద్దు చేయలేదని ముఖ్యమంత్రి తెలిపారు. వాటిని మరింత మెరుగ్గా అమలు చేస్తూనే కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని చెప్పారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, కొత్తగా ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను వివరించారు.రైతుల సంక్షేమం కోసం రుణమాఫీతో పాటు మొత్తం రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వెల్లడించారు.

రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

సిద్దిపేట జిల్లాలో రూ.544.11 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన మరికొన్ని పనులను ప్రారంభించారు. విద్య, విద్యుత్, రెవెన్యూ, ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15.44 కోట్లతో అదనపు తరగతి గదులు, రూ.13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. చిన్నకోడూరు మండలంలో రూ.7.50 కోట్లు, దౌల్తాబాద్ మండలంలో రూ.7.80 కోట్లతో తెలంగాణ పబ్లిక్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. జనగామ నియోజకవర్గంలో రూ.6.89 కోట్లతో మూడు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

పూర్తయిన పనులు ప్రారంభం

సిద్దిపేట జిల్లాలో రూ.54.67 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ ఉపకేంద్రాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రం, రూ.12 కోట్లతో నిర్మించిన క్యూల సముదాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.6.50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ మహిళా సంఘాల భవనాలు, రాయపోల్ మండలంలో రూ.3.87 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం, గజ్వేల్‌లో రూ.1.59 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పి. సుదర్శన్ రెడ్డి, వి. హనుమంతరావు, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్‌కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. అవార్డు గ్రహీతలు తమ రంగాల్లో కొనసాగిస్తున్న కృషికి ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు కె.వి.ఎన్. రెడ్డి, ఎం. భవాని రెడ్డితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సేవలందించిన ప్రముఖులను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలో సాగునీటి వసతుల విస్తరణతో పాటు రైతుల సంక్షేమానికి సంబంధించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి నాగార్జున మద్దతు

(మొదటి పేజీ తరువాయి)


కల్పించడం ఈ ఉద్యమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలకే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు.నవంబర్ 25 నుంచి 27వ తేదీ వరకు 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు పాదయాత్ర చేపట్టి మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో యువత, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రజల భాగస్వామ్యం పెరిగితే మాదకద్రవ్యాల సమస్యపై సమాజంలో మరింత చైతన్యం తీసుకురావచ్చని భావిస్తున్నారు.

ఈ ఉద్యమంలో నాగార్జున పాల్గొననుండటం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సినీ రంగానికి చెందిన ప్రముఖులు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా యువతపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. నాగార్జున తన మద్దతుతో మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తోడ్పడతున్నారు.యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఈ వేదిక ద్వారా పిలుపునివ్వనున్నారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు, ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. 'నషా ముక్త్ భారత్' లక్ష్య సాధనలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. నవంబర్ 25 నుంచి 27 వరకు జరిగే కార్యక్రమంలో భాగస్వాములై మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి చేయూతనివ్వాలని కోరారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా చేపడుతున్న ఈ ఉద్యమం ద్వారా హైదరాబాద్‌లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న కేటీఆర్

- **కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో ప్రత్యేక పూజలు**
- **మహా పడిపూజ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అయ్యప్ప స్వామి ఆరాధన**



హైదరాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరైన ఆయన అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో భక్తి వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు చేపట్టారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమానికి అనుగుణంగా ఆధ్యాత్మిక ఏర్పాట్లు చేశారు.కార్యక్రమానికి వచ్చిన కేటీఆర్‌కు నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజా కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామికి మొక్కులు సమర్పించారు. మహా పడిపూజ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ఆరాధనల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ కార్యక్రమం భక్తుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా కొనసాగింది.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు పార్టీ నాయకులు పూజల్లో పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు పొందారు. నాయకుల రాకతో కార్యక్రమ ప్రాంగణంలో సందడి నెలకొంది.భక్తులు, పార్టీ శ్రేణులు ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి మహా పడిపూజ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతకు వేదికగా నిలిచింది. రాజకీయ కార్యక్రమాలకు భిన్నంగా పార్టీ నాయకులు ఒకచోట చేరి పూజల్లో పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు..

అవినీతి పాలన

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ల విషయంలో ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 44 లక్షల 70 వేల పెన్షన్లు ఉండేవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాది 1.50 లక్షలు, రెండో ఏడాది మరో 1.50 లక్షలు, మూడో ఏడాది 1.70 లక్షల పెన్షన్లు తొలగించిందని, మొత్తంగా 4.70 లక్షల పెన్షన్లకు కోత పెట్టిందని విమర్శించారు. మరోవైపు కొత్తగా 4.63 లక్షల పెన్షన్లు మాత్రమే మంజూరు చేసిందని, తొలగించిన వాటితో పోలిస్తే కొత్తగా ఇచ్చినవి ఏడు వేల తక్కువగా ఉన్నాయని వివరించారు. పెన్షన్లు పెంచామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, వాస్తవంగా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించిందని ఆరోపించారు. పెన్షన్ల బడ్జెట్ కూడా పెరగలేదని, ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియకుండా ప్రభుత్వం ప్రచారానికి ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. నవంబర్‌లో రూ.2 వేలు, డిసెంబర్ నుంచి రూ.4 వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ, మూడు డిసెంబర్లు గడిచినా ఇప్పటికీ రూ.2 వేలే అందుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మొత్తం కూడా గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసినదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని ఒక్క రూపాయి కూడా పెంచలేదని మండిపడ్డారు. వృద్ధులు, వికలాంగులు ఆత్మ గౌరవంతో జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం పెన్షన్‌ను రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి, భట్టి విక్రమార్క అఫిడవిట్‌తో హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. గ్యారంటీ కార్డులను క్రెడిట్ కార్డుల్లా భద్రంగా పెట్టుకోవాలని చెప్పిన నాయకులు, హామీలను అమలు చేయలేకపోయారని విమర్శించారు.

అవినీతి సొమ్ముతో ఓటుకు రూ.15 వేలు ఇచ్చి ప్రజలను కొనుగోలు చేయవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. డబ్బులు పంచితే ప్రజలు తనకే ఓటు వేస్తారనే భ్రమలో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఏడాది తర్వాత వచ్చేది గులాబీ జెండానేనని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకులు తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. అవినీతికి పాల్పడిన వారిలో ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఢిల్లీ నాయకులు రాష్ట్రానికి వచ్చిన ప్పుడల్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు.ప్రియాంక గాంధీ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి వ్యవహరించిన తీరును, రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో బైక్‌పై వెళ్తున్నసమయంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి వెనుక పరుగులు తీసిన ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. బీజేపీలోనూ ఢిల్లీ నాయకుల పట్ల ఇదే ధోరణి కనిపిస్తోందని, అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాష్ట్ర నాయకులు వ్యవహరించిన తీరును ప్రశ్నించారు.

ఇదిలా ఉండగా, భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ప్రాంతంలో కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన గుర్తుచేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం మున్సిపాలిటీ, జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కాలేజీని తీసుకొచ్చామని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాటి సంఖ్యను 32కు పెంచామని, తద్వారా వేలాది మంది విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించే అవకాశం కల్పించామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రయోజనాల కోసం ఢిల్లీ పెద్దలను ప్రశ్నించకుండా వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయని, అధిష్ఠానానికి చెల్లించాల్సిన ఈఎంఐలు కట్టకపోతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి పోతుందంటూ వ్యాఖ్యానించారు. అందుకే ఆయనను రెగ్యులర్ ముఖ్యమంత్రి కాకుండా రెన్యువల్ ముఖ్యమంత్రి అని పిలుస్తున్నానని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతుందని, కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

కృష్ణా జలాల వాటాలో

రాజీ పడే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)



బలగాల పర్యవేక్షణ, కేఆర్ఎంబీ నియంత్రణ వంటి అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం వెనుక బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ అవగాహన ఉందని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కృష్ణా బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు పక్కన పెట్టారని, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధించలేకపోయారని అన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ ఆధునికీకరణ, డిండి వంటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే రాష్ట్రంలో సాగునీటి విస్తీర్ణం మరింత పెరిగేదని అభిప్రాయపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ.1.84 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసినప్పటికీ ఆశించిన ప్రయోజనాలు అందలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నాయని, జాతీయ స్థాయి నిపుణుల పరిశీలనలోనూ ఈ అంశాలు వెల్లడయ్యాయని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది కేసీఆర్ ప్రభుత్వమేనని విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి, షాదీ ముబారక్ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించిందని తెలిపారు. నెహ్రూ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని, నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టులు వ్యవసాయ రంగానికి కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని విమర్శలు, ప్రకటనలు చేసినా ప్రజలకు ప్రయోజనం ఉండదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని పునరుద్ఘాటించారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా సాధించేందుకు న్యాయపరంగా, పరిపాలనాపరంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పార్టీ నూతన ఇన్‌చార్జి సందీప్ నిబద్ధత కలిగిన నాయకుడని అభివర్ణించారు. నీటి అంశాన్ని రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా రాష్ట్ర ప్రయోజనాల దృష్టితో చూడాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 20 - నవంబర్ 2026

మీ హయాంలో జరగని పనులను మీ ఖాతాలో వేసుకోవడమేంటి రాజన్న?



- **అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారం మానుకోవాలి**
- **కడియం శ్రీహరిపై వ్యక్తిగత విమర్శలు సరికాదు**
- **కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్ ఘాటు వ్యాఖ్యలు**

స్టేషన్ ఘనపూర్,నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు): స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిపాక సతీష్ విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా, రాజయ్య ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టకముందే జరిగిన పనులను వారి హయాంలో జరిగినవిగా ఎలా చెప్పుకుంటారని ఆయన ప్రశ్నించారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్, ఫ్లైఓవర్ బ్రిడ్జి, పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణ పనులకు పునాదులు పడ్డాయని సతీష్ గుర్తుచేశారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్టేషన్ ఘనపూర్‌ను ఇందిరమ్మ గ్రామంగా ఎంపిక చేసిన సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈ అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అప్పటికి కేసీఆర్ ముఖ్యమంత్రిగా, రాజయ్య ఎమ్మెల్యేగా లేరని పేర్కొన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ గాంధీ చౌరస్తా నుంచి రైల్వే గేట్ వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఏళ్ల తరబడి సమయం పట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించి, అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును రెండుసార్లు అడ్డుకున్న అనంతరమే సంబంధిత అధికారుల ద్వారా రహదారి పనులు పూర్తి చేయించామని వివరించారు.అదేవిధంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌అండ్‌బీ అప్పటి ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ నాగేందర్, డీఈ జీవన్‌కుమార్‌లకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణం విషయంలో స్థానికుల అభిప్రాయాలను పట్టించుకోకుండా పిల్లర్ల బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల పట్టణ అభివృద్ధికి ఆటంకం కలిగిందని ఆరోపించారు.

జఫర్‌గఢ్, పాలకుర్తి రహదారుల నిర్మాణం కోసం కూడా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశామని, ఆ తర్వాతే పనులు ముందుకు సాగాయని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో వాస్తవాలను ప్రజలకు వివరించాల్సింది పోయి, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం తగదన్నారు. తొలి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వంద పడకల ఆసుపత్రి, మున్సిపాలిటీ మంజూరుకు సంబంధించిన జీవోలు తీసుకొచ్చినప్పటికీ వాటి పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం 75 ఏళ్ల వయసులోనూ కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వంద పడకల ఆసుపత్రి, మున్సిపాలిటీ, ఇంటిగ్రేటెడ్ విద్యా, వైద్య సదుపాయాలతో పాటు రైతులకు సాగునీరు అందించడం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ముఖ్యమంత్రి సహాయనిధి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రహదారుల నిర్మాణం వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి జరుగుతున్న కృషిని అభినందించాల్సింది పోయి, నిరాధార ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని సతీష్ మండిపడ్డారు. ఇకనైనా చరిత్రను వక్రీకరించే వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మామిడ్ల శ్రీనివాస్, గట్టు కోటేశ్వర్, సురేందర్, అజీముద్దీన్, నక్క పాపయ్య, ఏలీయా, రమేష్, శివ, కుమార్, శ్రీనివాస్, సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వంగాలపల్లిలో అర్హులకు పెన్షన్ల పంపిణీ



- **లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసిన సర్పంచ్ భూక్య మేనక, ఉపసర్పంచ్ అరూరి రవిచందర్**

వంగాలపల్లి,నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు): వంగాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య మేనక సుధాకర్ నాయక్, ఉపసర్పంచ్ అరూరి రవిచందర్ లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా నిరంతరం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామ అధ్యక్షుడు మాట్యాడ అశోక్, గ్రామ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడిలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఐ. సత్యారెడ్డి, మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్రత, అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం



ఆమె ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటేష్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, స్థానిక సర్పంచ్ సూర్య గంగమ్మ రవి, ఉప సర్పంచ్ ఉషన్న యాదవ్, చిన్నమందడి సర్పంచ్ స్వరూప, అనకాయిపల్లి తండా సర్పంచ్ ఆంజనేయులు, స్కూల్ తండా సర్పంచ్ మాన్యం, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ వాకిటి నరేష్, 6వ వార్డు సభ్యుడు కొమ్ము సత్యనారాయణ పాల్గొన్నారు.అలాగే కాంగ్రెస్ నాయకులు పల్లె సత్యనారాయణ, ఐ. ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాధాకృష్ణ, గట్టు యాదవ్, శేఖర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, చంద్రయ్య, పర్వతాలు, రాజు, సుర వెంకటస్వామి, బీచుపల్లి, వాకిటి దర్మన్, టీఎంఆర్ నాయకులు గట్టు రాజశేఖర్, ఎస్. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.





పీచరలో లబ్ధిదారులకు చేయూత పింఛన్ల పంపిణీ

వేలేరు, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మరిజే అనిత నర్సింగరావు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు తదితర అర్హులకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జితేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డు సభ్యులు కొలిపాక వెంకటేష్, గుడికందుల రాకేష్, వొద్దుల శ్రీకాంత్, రామంచ ప్రశాంత్, ఎడ్ల అశ్విని, సౌజన్య, సుకన్య, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిరాగాంధీకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఘన నివాళి

- **ఇందిరా చౌక్‌లో విగ్రహానికి పూలమాల.. ఇందిరమ్మ భీమా పోస్టర్ ఆవిష్కరణ**

కరీంనగర్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): భారతదేశ తొలి మహిళా ప్రధాన మంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరా చౌక్ వద్ద ఆమె విగ్రహానికి చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇందిరమ్మ భీమా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

- **వ్యవసాయ మార్కెట్ యార్డు, బొమ్మకల్‌లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య**

కరీంనగర్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్యతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మేయర్ ప్రారంభించారు.

అనంతరం నగరపాలక సంస్థ పరిధిలోని బొమ్మకల్ ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని తూకం వేసి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్‌ను రైతులు, రైతు సంఘాల నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కార్పొరేటర్లు మేకల వెంకటేష్, గాదె రూప శ్రీనివాస్, నాయకులు పురుమల్ల శ్రీనివాస్, రాంరెడ్డి, డైరెక్టర్లు బీరం అంజనేయులు, సాయిల్ల మహేందర్, బోనాల లింగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆశయాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి మార్గదర్శకం

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు**
- **వొడితల ప్రణవ్**

ఇల్లందకుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, పేద ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేసిన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆమె చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు.

గురువారం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా గాంధీ జయంతి వేడుకల్లో ప్రణవ్ పాల్గొని, ఆమె చిత్రపటానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్ల ద్వారా చేయూతనిస్తున్నామని పేర్కొన్నారు.

హుజురాబాద్ నియోజకవర్గానికి కొత్తగా 4,336 పెన్షన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గురువారం సిద్ధిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారని, ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు నిధులు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారని చెప్పారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ప్రణవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



సిద్దిపేట భారీ బహిరంగ సభకు తరలిన వంగర కాంగ్రెస్ నాయకులు

భీమదేవరపల్లి, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): సిద్దిపేట భారీ బహిరంగ సభకు భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు ప్రత్యేక వాహనాల్లో సభా ప్రాంగణానికి బయలుదేరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన సభల్లో వంగర గ్రామ కాంగ్రెస్ శ్రేణులు చురుకుగా పాల్గొంటాయని తెలిపారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు సభకు తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వంగర గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లాల రమేష్, శ్రీరామోజు మొండయ్య, చంద్రారెడ్డి, తిరుపతి, మైసయ్యతో పాటు పలువురు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చొరవతో వెల్టూర్ కు సింగిల్ విండో మంజూరు

- **హర్షం వ్యక్తం చేసిన పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు**

పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) మంజూరు కావడం పట్ల పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ, కృషితో వెల్టూర్ గ్రామానికి సింగిల్ విండో మంజూరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని అన్నారు. వెల్టూర్ గ్రామానికి సింగిల్ విండో మంజూరు కావడం ఆ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిన రైతులకు ఇకపై స్థానికంగానే సహకార సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.సింగిల్ విండో ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సేవలు సులభంగా అందడంతో పాటు రైతుల సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని అన్నారు. రైతుల చిరకాల అవసరాన్ని గుర్తించి వెల్టూర్ గ్రామానికి సింగిల్ విండో మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే నూతన సింగిల్ విండోల ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులోనూ రైతుల సంక్షేమానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, పెద్దమందడి మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వెల్టూరు ఉండి చేనేత సహకార సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు డిఎస్ మహేష్, వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్, వడ్డే శేఖర్, డీలర్ శ్రీనివాసులు, వివేక్, రాంసింగ్, చింతకాయల వెంకటేష్, రామచంద్రయ్య, వార్డు సభ్యులు నాగ భూషణ్, బజార్ వెంకటేష్, నాగార్జున, శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పెద్దమందడి విద్యార్థినుల ఎంపిక



పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్17 బాలికల హాకీ పోటీలకు వనపర్తి జిల్లా పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు.ఈ నెల 20, 21, 22 తేదీలలో వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రేవతి, 8వ తరగతి చదువుతున్న హరిణి, శిల్ప ఎంపికైనట్లు మండల విద్యాధికారి శాంతన్న, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కురుమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ మన్యం యాదవ్ తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను గ్రామ సర్పంచ్ గంగమ్మ రవి, ఉప సర్పంచ్ ఉషన్న యాదవ్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మధిరలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీ గ్లోబల్ విద్యార్థినుల ప్రతిభా చాటింపు!

- **అండర్-14 బాలికల విభాగంలో చింతకాని మండలం జట్టు తరపున సత్తా చాటిన విద్యార్థినులు**
- **విద్యార్థినులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి**



ఖమ్మం బ్యూరో, నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు): బుధవారం మధిరలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్14 కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో చింతకాని మండలం జట్టు తరపున పాల్గొన్న శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచ విద్యార్థినులు దుర్గా వైష్ణవి మరియు కృషిక ను అద్భుతమైన క్రీడా ప్రతిభను కనబరిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. జిల్లా స్థాయి పోటీల్లో మండల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ తమ ఆటతీరుతో ప్రతిభను చాటుకోవడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా శ్రీ గ్లోబల్ హై స్కూల్‌లో విద్యార్థినులను అభినందించే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించి, వారి క్రీడా ప్రతిభను కొనియాడారు.

ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నూ ఆసక్తి కనబరచాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవడం ఎంతో సంతోషకరమని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థినులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. క్రీడల్లో విజయం సాధించడానికి నిరంతర సాధన, పట్టుదల, జట్టుగా సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు అత్యున్నత ప్రతిపను కనపరచటానికి కారణమైనటువంటి పాఠశాల పీఈటి సమీర్ ను కూడా ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు వాహిని, సుధాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ తన్నీరు రామారావు, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించి ప్రశంసించారు.జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో శ్రీ గ్లోబల్ విద్యార్థినులు తమ ప్రతిభను చాటుకోవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

పీచర గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేలేరు,నవంబర్19(తెలంగాణముచ్చట్లు):- హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మరిజే అనిత-నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని సూచించారు.



రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, వార్డు సభ్యులు గుడికందుల రాకేష్,ఎపిఎం అనిత, సీసీ సతీష్, మహిళా సంఘాల సీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫారాల నిర్లక్ష్యం.. కుక్కల దాడిలో దుడ్డే మృతి!

వేలేరు, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు-):హనుమకొండ జిల్లా వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామంలో పౌల్ట్రీ వ్యర్థాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి, రాజిరెడ్డి నిర్వహిస్తున్న పౌల్ట్రీ ఫారాల నుంచి మృతి చెందిన కోళ్లను వ్యవసాయ భూముల్లో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా బహిరంగంగా పడేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఈ క్రమంలో మృతి చెందిన కోళ్లను తింటున్న కుక్కలు ఆహారం కోసం చుట్టు పక్కల వ్యవసాయ భూముల్లో సంచరిస్తూ పశువులపై దాడులకు పాల్పడుతున్నాయని



తెలిపారు. బుధవారం గుండ్లసాగర్ గ్రామానికి చెందిన వంగ రాజేందర్ తండ్రి కొమురయ్యకు చెందిన వ్యవసాయ బావి వద్ద ఉన్న బర్రె దూడను కుక్కలు దాడి చేసి చంపినట్లు వెల్లడించారు.

అంతేకాకుండా వ్యవసాయ పనులకు వెళ్లే రైతుల వెంట కుక్కలు పడి భయాందోళనలకు గురిచేస్తున్నాయని చుట్టుపక్కల రైతులు వాపోతున్నారు. పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులు మృతి చెందిన కోళ్లను నిబంధనలకు అనుగుణంగా పారవేయకుండా వ్యవసాయ భూముల్లో పడేయడం వల్లే ఈ సమస్య తలెత్తుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన దూడ యజమానికి న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకంతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

- **కొమ్ము వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు**



పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి సూచించారు.ఆయన ఆధ్వర్యంలో పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకానికి సంబంధించిన కరపత్రాలను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.కుటుంబానికి ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఈ బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం వివరాలను తెలుసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు ముఖ్యంగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గ్రామస్థులకు ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, చింతల వెంకటేశ్వర్లు, నవీన్, కుమ్మరి కొండన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బీమా విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలి

- **అర్హులైన ప్రతి రైతుకు రూ.5 లక్షల బీమా కల్పించాలి**
- **అల్వాల వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు**

పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన రైతు బీమా పథకంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై పునరాలోచన చేయాలని బీఆర్ఎస్ నాయకుడు అల్వాల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఒక గుంట భూమి కలిగిన రైతుకు సైతం రూ.5 లక్షల రైతు జీవిత బీమా సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. ఒకే కుటుంబంలో ఎంతమంది అర్హులైన రైతులు ఉంటే అంతమందికి వ్యక్తిగతంగా బీమా వర్తించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని ఒక కుటుంబానికి ఒక్కరికే బీమా వర్తింపజేస్తే, అదే కుటుంబంలో వ్యవసాయం చేస్తున్న మిగతా రైతులు బీమా సౌకర్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రభుత్వం రేషన్ కార్డు నిబంధనపై పునరాలోచించి, భూమి కలిగి వ్యవసాయం చేస్తున్న ప్రతి అర్హ రైతుకు వ్యక్తిగతంగా రూ.5 లక్షల రైతు జీవిత బీమా కల్పించాలని కోరారు. రైతులందరికీ సమాన న్యాయం జరిగేలా గతంలో అమలైన రైతు బీమా విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పనిచేస్తుందని, రైతులకు



న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామని అల్వాల వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 20 - నవంబర్ 2026

ఉద్యమకారుల హక్కుల కోసం మేడారం నుంచి మరో పోరుబాట

- **కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలి**
- **ఎక్కడి సంజీవరెడ్డి**



జమ్మికుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, అలుపెరుగని పోరాటాలు సాగించిన ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కడి సంజీవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న మేడారంలో నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ చలో మేడారం మహాపాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గురువారం జమ్మికుంటలో చలో మేడారం మహాపాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు తమ కుటుంబాలను, వ్యక్తిగత జీవితాలను సైతం పక్కనపెట్టి పోరాటం చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని పేర్కొన్నారు. అలాంటి ఉద్యమకారులకు నేటికీ తగిన గుర్తింపు, గౌరవం, ప్రభుత్వపరమైన భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఉద్యమకారులకు పలు హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హామీలను ప్రకటనలకే పరిమితం చేయకుండా తక్షణమే అమలు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు మేడారంలోని జంపన్న వాగు నుంచి సమ్మక్క-సారలమ్మ గద్దెల వరకు మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మక్క-సారలమ్మల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వాములైన ప్రతి ఉద్యమకారుడు ఈ పాదయాత్రలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. ఉద్యమ సంఘాలు, ప్రజాసంఘాలు, తెలంగాణ అభిమానులు ఈ కార్యక్రమానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ, ములుగు జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎక్కడి సంజీవరెడ్డి, జిల్లా నాయకులు మూడెడ్ల కుమారస్వామి, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె రమేష్ రెడ్డి, మోతె స్వామి, పాతకాల ఓదెలు, బిట్ల శ్రీనివాస్, ఇల్లందుల శ్రీనివాస్, ఎజ్జ తిరుపతి, పోచం వెంకన్న, కన్నూరి శ్రీనివాసు, గడ్డి కొమురయ్య, గడ్డి రాములు, తోడేటి జితేందర్, యమ శ్రీనివాసు, అన్నారపు వీరస్వామి, గాజ రాజయ్య, అబ్బీడి శ్రీపాల్ రెడ్డి, దాసరి తిరుపతిరెడ్డి, బండి మల్లయ్య, ఉప్పుల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో ఆధునిక వైద్య సేవలకు శ్రీకారం



- **రిషిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం**
- **అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపీ, లేజర్ సర్జరీ సేవలు అందుబాటులోకి**

జమ్మికుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట పట్టణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నూతనంగా ఏర్పాటు చేసిన రిషిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని బుధవారం ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ బి. రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా హనుమకొండలోని కూరపాటి ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కూరపాటి రమేష్ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపీ, లేజర్ సర్జరీ వైద్య సేవలను ప్రారంభించారు. ఇకపై ప్రతి మంగళవారం డాక్టర్ కూరపాటి రమేష్ జమ్మికుంటలోని రిషిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించనున్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. మెరుగైన వైద్య సదుపాయాలను ప్రజలకు అందించేందుకు ముందుకొచ్చిన ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మాచర్ల రాజు, ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల ఆర్సీ పత్రాలను పోగొట్టుకున్న పలుస శ్రీనివాస్ గౌడ్



పెద్దమందడి,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన పలుస శ్రీనివాస్ గౌడ్ తనకు సంబంధించిన రెండు వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు (ఆర్సీ) పత్రాలను పోగొట్టుకున్నారు. ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు.తనకు చెందిన AP22Y6261, TS15UA8056 రిజిస్ట్రేషన్ నంబర్లు కలిగిన రెండు వాహనాల ఆర్సీ పత్రాలు కనిపించకుండా పోయాయని తెలిపారు. వాహనాలకు సంబంధించిన ముఖ్యమైన ధ్రువపత్రాలు పోగొట్టుకోవడంతో వాటి స్థానంలో నకలు ఆర్సీ పత్రాలు పొందేందుకు అవసరమైన మిస్సింగ్ డాక్యుమెంట్స్ సర్టిఫికెట్ కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. పోగొట్టుకున్న ఆర్సీ పత్రాలకు సంబంధించి అవసరమైన ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని, తద్వారా నకలు ఆర్సీ పత్రాలు పొందేందుకు అవకాశం కల్పించాలని అధికారులను కోరారు.

మాదిగ ఉపకులాల వనభోజనాలకు ప్రముఖులకు ఆహ్వానం




- **చాకలి ఐలమ్మ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. మల్లేశం, ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్‌కు ఆహ్వానం పలికిన డాక్టర్ పిడమర్తి రవి**


హైదరాబాద్,నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో నవంబర్ 29న నిర్వహించనున్న మాదిగ ఉపకులాల వనభోజనాల కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. మల్లేశం, ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్‌లను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి వారిని కలిసి నవంబర్ 29న నిర్వహించనున్న వనభోజనాల కార్యక్రమం వివరాలను తెలియజేశారు. మాదిగ ఉపకులాల మధ్య ఐక్యత, సోదరభావం, ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన మాదిగ ఉపకులాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, మేధావులు, యువత, సంఘాల ప్రతినిధులు ఒకే వేదికపై కలుసుకునేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సమాజంలో మాదిగ ఉపకులాల ఐక్యతను చాటడంతో పాటు పరస్పర పరిచయాలు, ఆత్మీయతలు, సామాజిక సంబంధాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అందరూ కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నవంబర్ 29న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే ఈ వనభోజనాల కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానిస్తూ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మాదిగ ఉపకులాల ప్రజలు, నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిస్తున్నారు.





మహిళా సాధికారతకు సిరిసేడులో కొత్త వేదిక

- **సిరిసేడులో మహిళా సమాఖ్య భవనం ప్రారంభం**

ఇల్లందకుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మహిళా సమాఖ్య భవనాలు ఎంతగానో దోహదపడతాయని సిరిసేడు గ్రామ సర్పంచ్ రేణుకుంట్ల శ్యామల-కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని సర్పంచ్ రేణుకుంట్ల శ్యామల-కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి సరైన వసతి లేక చెట్ల కింద సమావేశాలు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో మహిళా సంఘాల సభ్యులకు ఆ ఇబ్బందులు తొలగనున్నాయని పేర్కొన్నారు.ఈ భవనం మహిళా సంఘాల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





ఇందిరమ్మ బీమాతో ప్రతి కుటుంబానికి భరోసా

- **సిద్ధిపేట సభకు జమ్మికుంట కాంగ్రెస్ శ్రేణుల భారీ తరలింపు**

జమ్మికుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): సిద్ధిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న ఇంటింటికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమానికి జమ్మికుంట మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు, జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమనేని పరశురామ్ రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సభకు బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ కొండ అర్జున్, నాగారం సర్పంచ్ మమత ప్రదీప్, మడిపెల్లి సర్పంచ్ తిరుమల వెంకటేష్, ఉపసర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వావిలాల సర్పంచ్ కొండ అర్జున్ మాట్లాడుతూ రేషన్ కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయడం అభినందనీయమన్నారు. కుటుంబాల భద్రత, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెడుతున్న ఈ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొండ అర్జున్ పేర్కొన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం

- **నూతన పెన్షన్ పత్రాలు అందజేసిన 10వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్**

జమ్మికుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): వార్డులోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని జమ్మికుంట మున్సిపాలిటీ 10వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా 10వ వార్డులో నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ స్వయంగా పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పెన్షన్ ఆర్థికంగా ఎంతో తోడ్పాటునిస్తుందని ఆమె పేర్కొన్నారు.

వార్డులో అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను సేకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు.

ప్రజాప్రతినిధిగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని చందన శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ లబ్ధిదారులు, స్థానికులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులకు యువతే దిక్సూచి

- **ఉన్నత విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి.**
- **ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన అవసరం – బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్ రావు**

కరీంనగర్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): ఉన్నత చదువులు చదివిన యువత క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పుడే దేశ రాజకీయ వ్యవస్థలో సమూల మార్పులు సాధ్యమవుతాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే భారత ప్రజాస్వామ్యం అత్యున్నతమైనదని, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నిత్యం వార్తాపత్రికలు చదువుతూ, పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాలను వీక్షిస్తూ సమకాలీన రాజకీయాలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు.

కరీంనగర్‌లోని త్రిధ హోటల్‌లో అద్వైత ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘అద్వైత యూత్ పార్లమెంట్-2026’ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివేకానంద విద్యాసంస్థల చైర్మన్, కార్పొరేటర్ సొగాని కొమరయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు, ఎంపీల వేషధారణలో విద్యార్థులు నిర్వహించిన చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతూ ఆరు సార్లు కార్పొరేటర్‌గా, మేయర్‌గా, ప్రస్తుతం డిప్యూటీ మేయర్‌గా ప్రజాసేవ చేస్తున్నట్లు తెలిపారు. పొరుగు దేశాల్లో సైనిక పాలన, నియంతృత్వ పోకడలు, అస్థిర ప్రభుత్వాలు కనిపిస్తున్నప్పటికీ, 148 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా కొనసాగుతోందని అన్నారు. ఇంతటి గొప్ప ప్రజాస్వామ్య దేశంలో పొరుడిగా జన్మించడం అదృష్టమని పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బలమైన నాయకత్వంలో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా విశేష గౌరవం లభిస్తోందని, 35 దేశాలు ప్రధానమంత్రికి అత్యున్నత పురస్కారాలు అందించడం దేశానికి గర్వకారణమని కొనియాడారు. చిన్న వయస్సులోనే విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న అద్వైత ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులకు యువతే దిక్సూచి

- **కాలుష్య నియంత్రణ మండలి పలుమార్లు నోటీసులు ఇచ్చినా మారని యాజమాన్యం**
- **తీరు క్లోరోఫామ్ విషవాయువు లీకై ఇద్దరి మృతి..**
- **సిగాచి ఘటన తర్వాత కూడా పరిశ్రమల భద్రతపై నిర్లక్ష్యమెందుకు?**
- **సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మెట్టు శ్రీధర్**



సంగారెడ్డి,నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు): పరిశ్రమల భద్రతా వైఫల్యాలు మరోసారి అమాయకుల ప్రాణాలను బలిగొన్నాయి. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలోని సరకా లేబొరేటరీస్ పరిశ్రమలో క్లోరోఫామ్ విషవాయువు లీకై ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని నవభారత్ నిర్మాణ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ అన్నారు. గతంలోనే కాలుష్య నియంత్రణ మండలి పలుమార్లు నోటీసులు, ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిశ్రమలో భద్రతా లోపాలు కొనసాగడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఈ పరిశ్రమకు సంబంధించిన అనుమతులు, కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన నోటీసులు, అధికారుల తనిఖీలు, గేదెల మరణాలపై తీసుకున్న చర్యలు, తాజా ప్రమాదం, పరిశ్రమ మూసివేత ఉత్తర్వులకు సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం2005 ద్వారా అధికారికంగా సేకరించినట్లు మెట్టు శ్రీధర్ వెల్లడించారు. నవంబర్ 19న అందిన సమాచారంలో పరిశ్రమలో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న పర్యావరణ, భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

ఏళ్లుగా నోటీసులు.. అయినా మారని తీరు!

కాలుష్య నియంత్రణ మండలి రికార్డుల ప్రకారం సరకా లేబొరేటరీస్‌కు 2020 నవంబర్ 23, 2021 అక్టోబర్ 7, డిసెంబర్ 1, 2023 సెప్టెంబర్ 13 తేదీల్లో ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడైందన్నారు. అంతేకాకుండా 2025 ఫిబ్రవరి 8, 2026 మార్చి 13, ఆగస్టు 6 తేదీల్లోనూ నిబంధనల ఉల్లంఘనలు, అనుమతి షరతుల అమలుకు సంబంధించి తదుపరి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇన్ని సందర్భాల్లో అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ పరిశ్రమలో భద్రతా లోపాలు ఎందుకు కొనసాగాయి? నిబంధనల అమలును అధికారులు ఎంతవరకు పర్యవేక్షించారు? లోపాలు గుర్తించినప్పుడు ముందుగానే కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గేదెల మరణాలపై విచారణ ఏమైంది?

సదరు పరిశ్రమ కారణంగానే గేదెల మరణాలు సంభవించిన అంశంపై 2024 సెప్టెంబర్ 19, 2025 జనవరి 31 తేదీల్లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి లేఖలు రాసినట్లు అధికారిక పత్రాల్లో పేర్కొన్నారని శ్రీధర్ తెలిపారు. రెవెన్యూ, పశువైద్య, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో విచారణ జరిపించి గేదెల మరణాలకు కారణాలను గుర్తించాలని, బాధితులకు పరిహారం చెల్లించాల్సిన అంశాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని కోరినట్లు వివరించారు. అయితే ఆ విచారణలో ఏం తేలింది? బాధిత పశువుల యజమానులకు పరిహారం అందిందా? పరిశ్రమపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు.

క్లోరోఫామ్ లీకేజీతో ఇద్దరి ప్రాణాలు బలి

2026 అక్టోబర్ 22 రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో పరిశ్రమలోని ఉత్పత్తి విభాగం2లో రియాక్టర్ నుంచి లేయర్ సెపరేషన్ జరుగుతున్న సమయంలో క్లోరోఫామ్ విషవాయువులు లీకైనట్లు అధికారుల తనిఖీ నివేదికలో పేర్కొన్నారని తెలిపారు. ప్రమాద సమయంలో రియాక్టర్‌లో సుమారు 1,750 లీటర్ల క్లోరోఫామ్ సెపరేషన్ లేయర్ ఉన్నట్లు పరిశ్రమ అధికారులు వెల్లడించినట్లు వివరించారు. విషవాయువుల ప్రభావానికి గురైన ఇద్దరు వ్యక్తులు అపస్మారక స్థితికి చేరుకోవడంతో నారాయణ ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించినట్లు నివేదికలో నమోదైందన్నారు.

తనిఖీల్లో బయటపడ్డ భద్రతా లోపాలు

అక్టోబర్ 23న నిర్వహించిన తనిఖీల్లో స్క్రబ్బర్ వెంటిలేషన్ పైప్, హెచ్‌డీపీఈ వాల్వ్ దెబ్బతినడం, స్క్రబ్బర్ డక్ట్ సమీపంలో లీకేజీ అవశేషాలు కనిపించడం, ప్రమాద ప్రాంతంలో క్లోరోఫామ్ వాసన కొనసాగడం వంటి అంశాలను అధికారులు గుర్తించినట్లు మెట్టు శ్రీధర్ తెలిపారు. ప్రమాద ప్రాంతంలో వీఓసీ స్థాయి 20 పీపీఎం వరకు నమోదవగా, ఉత్పత్తి విభాగం వెలుపల 0.1 పీపీఎం నమోదైనట్లు తనిఖీ నివేదికలో పేర్కొన్నారని వివరించారు.

అంతేకాకుండా క్లోరోఫామ్ లీకేజీని ముందుగానే గుర్తించేందుకు అలారం సౌకర్యంతో కూడిన సెన్సార్లు ఏర్పాటు చేయకపోవడం, డబుల్ స్టేజ్ స్క్రబ్బర్ ఉన్నప్పటికీ యాక్టివేటెడ్ చార్కోల్ బెడ్‌తో కూడిన సబ్ కూలర్ కండెన్సర్ లేకపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ప్రమాదకర రసాయనాలతో పనిచేసే పరిశ్రమలో ఇలాంటి కీలక భద్రతా ఏర్పాట్లు లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

ప్రమాదం తర్వాతే స్పందిస్తారా?

ఇటీవల సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రమాదకర పరిశ్రమల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని శ్రీధర్ అన్నారు. సిగాచి దుర్ఘటన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదకర పరిశ్రమల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారా? భద్రతా ఆడిట్లు చేపట్టారా? గుర్తించిన లోపాలను సరిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే విషయాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా స్పందించడం కాకుండా, ముందస్తు తనిఖీల ద్వారా ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

పరిశ్రమ మూసివేతకు కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు

తనిఖీల్లో గుర్తించిన లోపాలు, భద్రతా చర్యల అమలులో వైఫల్యాలను పరిగణనలోకి తీసుకున్న కాలుష్య నియంత్రణ మండలి 2026 అక్టోబర్ 23న సరకా లేబొరేటరీస్ మూసివేతకు ఆదేశాలు జారీ చేసినట్లు శ్రీధర్ వెల్లడించారు. నీటి కాలుష్య నివారణ చట్టంలోని సెక్షన్ 32, 33(ఏ), వాయు కాలుష్య నివారణ చట్టంలోని సెక్షన్ 31(ఏ) ప్రకారం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థను ఆదేశించడంతో పాటు 48 గంటల్లో అమలు నివేదిక సమర్పించాలని కోరినట్లు వివరించారు. అలాగే పరిశ్రమ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని, ప్రమాదం కారణంగా ఏర్పడిన కలుషిత మురుగునీరు, వ్యర్థాలను సేకరించి తగిన శుద్ధి వ్యవస్థలకు పంపాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉత్తర్వులను ఉల్లంఘించి పరిశ్రమను కొనసాగిస్తే సంబంధిత చట్టాల ప్రకారం ప్రాసిక్యూషన్, జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

అనుమతులున్నా భద్రతా బాధ్యత తప్పదు

మరోవైపు పరిశ్రమకు 2026 మార్చి 2న ఆటో రెన్యూవల్ ద్వారా నిర్వహణ అనుమతి మంజూరై 2031 మార్చి 31 వరకు గడువు ఉన్నట్లు అధికారిక పత్రాల్లో వెల్లడైందని శ్రీధర్ తెలిపారు. అయితే నిర్వహణ అనుమతి ఉన్నంత మాత్రాన పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, ప్రమాద నివారణ నిబంధనలను పాటించాల్సిన బాధ్యత నుంచి పరిశ్రమ యాజమాన్యానికి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.

సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సరకా లేబొరేటరీస్‌లో జరిగిన ప్రమాదంపై ఉన్నతస్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించాలని మెట్టు శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన ప్రతి నోటీసు, ఆదేశం అమలుపై సమగ్రంగా పరిశీలించాలని, గేదెల మరణాలపై జరిగిన విచారణ నివేదికను, బాధితులకు అందించిన పరిహారం వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. తాజా ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యం లేదా భద్రతా వైఫల్యాలు కారణమని విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు చేయూత



- **క్రీడా దుస్తులు, 180 స్టీల్ గ్లాసుల పంపిణీ**

హుజురాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): చిన్నారుల చిన్న చేతుల్లో ఎన్నో పెద్ద కలలు దాగి ఉన్నాయని, ఆ కలలను సాకారం చేసుకునేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని మనోజ్‌రావు అన్నారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీయూపీఎస్ పాఠశాలలోని బాలబాలికలకు ఉచితంగా స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని పాల్గొని విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. చిన్నారుల అవసరాలను గుర్తించి వారికి చేయూత అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు.

హుజూరాబాద్‌లో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వైభవంగా ప్రత్యేక పూజలు



- **భక్తిశ్రద్ధలతో మహాగణపతి హోమం, పంచసూక్త పారాయణం – పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

హుజురాబాద్,నవంబర్ 19(తెలంగాణ ముచ్చట్లు): హుజూరాబాద్ పట్టణంలోని బోర్నపల్లి రోడ్డులో గల శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. గత రెండు రోజులుగా వేద పండితుల అధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా గురువారం ఉదయం నుంచి మండప పూజలు, అష్టదిక్పాలక హోమం, విశ్వాంబర పూజ, స్వస్తివాచనం, మహాగణపతి హోమం, పంచసూక్త పారాయణం, కుంకుమార్చన, దీపారాధన, పుష్పాభిషేకం, వేద పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. స్వామీజీ విద్యా ప్రసన్న తీర్థ స్వామివారిని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఆలయ ప్రాంగణమంతా భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హుజూరాబాద్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ వేడుకల్లో మాజీ ఎంపీ వొడితెల లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ప్రధాన పూజారి పండిత్ బాస్కర్ శర్మ, దేవస్థానం కమిటీ అధ్యక్షుడు దొంత రమేష్, కార్యదర్శి అంగిరేకి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

విద్యుత్ మోటార్ల దొంగతనాల ముఠా అరెస్ట్

- **రూ.18.44 లక్షల విలువైన 84 మోటార్లు స్వాధీనం**
- **దొంగతనాలకు ఉపయోగించిన నాలుగు వాహనాలు పట్టివేత**

నర్సంపేట, నవంబర్ 19 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ నీటి మోటార్లను అపహరిస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను నర్సంపేట పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు మరో నలుగురు బాలురను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.18,44,800 విలువైన 84 విద్యుత్ నీటి మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు ఉపయోగించిన నాలుగు వాహనాలను కూడా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో నర్సంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ రాజన్ బాబు సిబ్బందితో కలిసి రాజుపేట క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒక ట్రాలీ ఆటో, ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా వస్తున్న ఏడుగురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వరంగల్ నేర పరిశోధన విభాగం పోలీసుల సహకారంతో విచారించగా విద్యుత్ మోటార్ల దొంగతనాలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో నిందితులు డీజే ఆపరేటర్లుగా, వేదికల అలంకరణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు వెల్లడైంది. జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ నీటి మోటార్లను అపహరిస్తున్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 20 - నవంబర్ 2026
వరంగల్ 07





నిరుద్యోగ యువతకు అండగా కరెంట్ అఫైర్స్ పుస్తకాల పంపిణీ

- **రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి.. లేదా రెండు ఎమ్మెల్సీలను ఓడగొట్టాలి**
- **యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలి..**
- **నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ న్యాయపోరాటం చేసింది**
- **నన్ను చట్టసభకు పంపితే మీ గొంతుకగా నిలబడతా.. మీ గౌరవం పెరిగేలా పనిచేస్తా**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి**

వరంగల్,నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు):

నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన అధ్యయన సామగ్రిని అందించడం అభినందనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. లైబ్రరీలు, కోచింగ్ కేంద్రాల సందర్శన కార్యక్రమంలో భాగంగా గురువారం వరంగల్ ప్రాంతీయ గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కరెంట్ అఫైర్స్ బిట్స్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆశలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం తగదని, రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి.. లేదంటే రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలను ఓడగొట్టేలా నిరుద్యోగ యువత తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను తక్షణమే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. నిరుద్యోగ యువత సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ గతంలో కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా న్యాయపోరాటం కూడా చేసిందని, యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు సంబంధించి 3.8 మీటర్ల లాంగ్ జంప్ అర్హత నిబంధనను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. ఈ నిబంధన కారణంగా ఎంతోమంది అభ్యర్థులు తదుపరి దశకు అర్హత సాధించలేక అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నిబంధనలను పునఃపరిశీలించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భారీ సంఖ్యలో పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గిరిజన, ఆదివాసీ యువతకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో న్యాయం జరిగేలా 75 శాతం స్థానిక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. గ్రూప్ 1 నియామకాలు, డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలకు సంబంధించి వస్తున్న అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులైన అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు చిన్న సహకారం..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నాణ్యమైన అధ్యయన సామగ్రి అందించాలనే ఉద్దేశంతో కరెంట్ అఫైర్స్ బిట్స్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని రాకేశ్ రెడ్డి తెలిపారు. ఒక ఉద్యోగం సాధించేందుకు విద్యార్థులు పడుతున్న కష్టం, వారి కుటుంబాలు పెట్టుకున్న ఆశలు తనకు తెలుసన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా లక్ష్య సాధన కోసం శ్రమిస్తున్న నిరుద్యోగ యువతకు తమ వంతుగా సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. పుస్తకాల పంపిణీ చిన్న సహకారమే అయినప్పటికీ, విద్యార్థుల విజయ ప్రయాణంలో అండగా నిలవాలన్నదే తమ సంకల్పమని పేర్కొన్నారు.

నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం..

గత 14 ఏళ్లుగా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తున్నానని రాకేశ్ రెడ్డి అన్నారు. తాను ఈ ప్రాంత బిడ్డనని, ఇక్కడి విద్యార్థులు, నిరుద్యోగ యువత, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రయాణం, ప్రజలతో ఉన్న అనుబంధం, చేసిన పోరాటాలు ప్రజలందరికీ తెలుసని, తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని అన్నారు.

తనకు చట్టసభలో ప్రాతినిధ్యం వహించే అవకాశం కల్పిస్తే పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థుల సమస్యలను బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, తనపై నమ్మకంతో బాధ్యత అప్పగిస్తే ప్రజల గౌరవం పెరిగేలా, ఈ ప్రాంత ప్రతిష్ఠ ఇనుమడించేలా పనిచేస్తానని అన్నారు. పదవుల కోసం ప్రజల వద్దకు రావడం కాకుండా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన నాయకత్వమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆశయాలు నెరవేరి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించినప్పుడే వారి కుటుంబాల్లో నిజమైన ఆనందం వెల్లివిరుస్తుందని రాకేశ్ రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్, గువ్వ రాజేష్, ఎలీషా, జన్ను విద్యా, షరీఫ్, యువజన నాయకులు పురుషోత్తం, రమేష్, రేవంత్, వంశీ రెడ్డి, వాసు, జన్ను యువరాజు, రాకేష్‌తో పాటు పలువురు నిరుద్యోగ యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్, గ్రౌండ్ ఫోకస్ లైట్లు అందజేత



- **యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి**
- **వడ్డే శ్రీనివాసులు**

కొత్తకోట,నవంబర్19(తెలంగాణ ముచ్చట్లు): యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామ యువకులను క్రీడల్లో ప్రోత్సహించే ఉద్దేశంతో తన మనవడు విశ్వదేవజ్ఞ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌తో పాటు గ్రౌండ్ ఫోకస్ లైట్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, ఐకమత్యాన్ని అలవర్చుతాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని యువకులకు పిలుపునిచ్చారు.అలాగే ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను ప్రేమించాలని, గురువులను గౌరవించాలని, అప్పుడే జీవితంలో ఏ రంగంలోనైనా విజయం సాధించగలరని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో సాధన చేసి గెలుపు దిశగా అడుగులు వేయాలని సూచించారు. గ్రామ యువత క్రీడల్లో ముందుకు సాగేందుకు తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త సాయిలు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, ధనుష్, డీకే లక్ష్మణ్ పాల్గొన్నారు.


వాయు కాలుష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి




- **భూపేందర్ యాదవ్**
- **ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ**

న్యూఢిల్లీ, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలను మరింత కఠినతరం చేయాలని నిర్ణయించింది. కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఏమాత్రం ఉపేక్ష చూపకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలుష్యానికి కారణమయ్యే కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని, నిబంధనలు పాటించని వ్యక్తులు, సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని స్థానిక సంస్థలు, మున్సిపల్ విభాగాలు కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. రహదారులు, బహిరంగ ప్రదేశాలు, నిర్మాణ ప్రాంతాలు సహా కాలుష్యానికి దారితీసే అంశాలపై సంబంధిత సంస్థలు నిరంతరం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు తీసుకునే చర్యలు కేవలం ఆదేశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినమైన జరిమానాలు, ఇతర శిక్షాత్మక చర్యలు తీసుకోవాలని భూపేందర్ యాదవ్ స్పష్టం చేశారు. కాలుష్యానికి కారణమవుతున్న వారిని గుర్తించి బాధ్యత వహించేలా చేయాలని సూచించారు. ఉల్లంఘనలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరించాలని స్థానిక సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వార్డుల స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారుల పనితీరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రతి వార్డులో కాలుష్య నియంత్రణకు చేపట్టిన చర్యలు, వాటి అమలు తీరు, ఎదురవుతున్న సమస్యలపై నిరంతరం సమీక్ష జరగాలని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించి, వాటి అమలుపై జవాబుదారీతనం ఉండేలా చూడాలని ఆదేశించారు. రోజువారీ పర్యవేక్షణ ద్వారా లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంపై స్థానిక సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలని భూపేందర్ యాదవ్ కోరారు. ప్రతి చర్యకు గడువు నిర్ణయించి, ఆ మేరకు పురోగతిని సమీక్షించాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం పెంచడంతో పాటు అమలులో నిర్లక్ష్యం వహించే వారిపై బాధ్యతను నిర్ధారించాలని తెలిపారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన నిర్ణయాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యం, సాధారణ జీవనంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్థానిక సంస్థలు, సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేయాల్సి ఉంది. నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు, వార్డుల వారీగా రోజువారీ పర్యవేక్షణ, అధికారుల జవాబుదారీతనం, నిర్దిష్ట గడువుల్లో చర్యల అమలు వంటి అంశాలపై కేంద్రం దృష్టిసారించింది.





ఝాన్సీ లక్ష్మీబాయి పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం

- **మహిళల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందాలి: నిత్యశ్రీ**

జమ్మికుంట, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసమాన పోరాట పటిమ, దేశభక్తి యావత్ భారతదేశానికి స్ఫూర్తిదాయకమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ బాలికల కన్వీనర్ నిత్యశ్రీ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే బ్రిటిష్ పాలకులను ఎదిరించి పోరాడిన ఆమె వీరత్వం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని కొనియాడారు.వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్త్రీ శక్తి దివస్' కార్యక్రమంలో నిత్యశ్రీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం నేటి యువతకు, ముఖ్యంగా విద్యార్థినులకు ధైర్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తూ సమాజంలో తమదైన గుర్తింపు సాధించాలని పిలుపునిచ్చారు.మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో చైతన్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు ఈ సందర్భంగా బహుమతులు, పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి భోగం శశాంక్, సంయుక్త కార్యదర్శులు ఆదిత్య, ఆఫ్రిద్, ఉపాధ్యక్షులు మోయిజ్, ఆరిఫ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల ఏర్పాట్ల పరిశీలన

- **చీకటిమామిడి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్**
- **దరఖాస్తుల నమోదు కోసం చేసిన ఏర్పాట్ల తనిఖీ**
- **బొమ్మలరామారం మండలంలో క్షేత్రస్థాయి పరిశీలన**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం అమలుపై దృష్టి**



భువనగిరి, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదుకు చేపట్టిన ఏర్పాట్లను యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.

ఈ పథకం కింద లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయంలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియకు అవసరమైన సదుపాయాలను పరిశీలించారు. గ్రామస్థాయిలో పథకం అమలుకు చేపట్టిన కార్యాచరణను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో దరఖాస్తుల నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్యాలయాలను కేంద్రాలుగా చేసుకుని దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చీకటిమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అనురాగ్ జయంతి, పథకం అమలుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామస్థాయిలో దరఖాస్తుల నమోదు సజావుగా జరిగేలా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు.జిల్లాలో పథకం అమలులో భాగంగా గ్రామస్థాయిలో చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. చీకటిమామిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల నమోదు కోసం చేసిన ఏర్పాట్లను తనిఖీ చేసిన ఆయన, పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ప్రశ్నించే పౌరులే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం!

- ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు
- అధికారంలో ఉన్నవారిని నిలదీస్తేనే పాలనలో జవాబుదారీతనం
- విమర్శలను శత్రుత్వంగా భావించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం
- ప్రజల గొంతుకకు విలువ ఇచ్చినప్పుడే నిజమైన ప్రజాపాలన



డెస్క్ నవంబర్ 19, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు ఓట్లు వేయడం, ప్రభుత్వాలు ఏర్పాటు కావడం మాత్రమే కాదు. ప్రజల అభిప్రాయాలకు విలువ ఉండాలి. పాలకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే స్వేచ్ఛ ఉండాలి. తప్పులను ఎత్తిచూపే గొంతుకలకు రక్షణ ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థకు నిజమైన అర్థం ఉంటుంది. కానీ నేటి రాజకీయ, సామాజిక పరిస్థితులను పరిశీలిస్తే ప్రశ్నించే గొంతుకలను అనుమానంగా చూడటం, విమర్శలను వ్యతిరేకతగా చిత్రీకరించడం, ప్రభుత్వ విధానాలను నిలదీసేవారిపై రాజకీయ ముద్రలు వేయడం వంటి ధోరణులు కనిపిస్తున్నాయి. ప్రజలు ప్రశ్నిస్తే అభివృద్ధికి వ్యతిరేకులని, ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే రాజకీయ ప్రత్యర్థులని ముద్ర వేయడం ఎంతవరకు సమంజసం? ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రజలకు లేదా? పాలకులు ప్రజలకు సేవకులుగా ఉండాలే తప్ప ప్రశ్నలకు అతీతులుగా భావించుకోకూడదు. ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఐదేళ్లపాటు ప్రభుత్వ నిర్ణయాలను మౌనంగా అంగీకరించాలని ఎక్కడా లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారా? ప్రజాధనం సక్రమంగా ఖర్చు చేస్తున్నారా? అభివృద్ధి పనులు నిజంగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయా? నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, విద్య, వైద్యం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతవరకు ఫలితాలు ఇస్తున్నాయి? అనే ప్రశ్నలు అడగడం పౌరుల బాధ్యత. ప్రభుత్వాలు ప్రజల పన్నులతోనే నడుస్తాయి. కాబట్టి ఆ నిధుల వినియోగంపై ప్రజలకు తెలుసుకునే హక్కు ఉంది. ప్రజాప్రతినిధులు తమ నిర్ణయాలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. ప్రశ్నించే పౌరులు ఉన్నప్పుడే పాలకుల్లో బాధ్యత పెరుగుతుంది. ప్రజలు మౌనంగా ఉంటే తప్పులను గుర్తించే అవకాశం తగ్గుతుంది. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం అనేది వ్యతిరేకతకు సంకేతం కాదు.. వ్యవస్థను సరిదిద్దే నిర్మాణాత్మక ప్రక్రియ.ప్రస్తుతం రాజకీయాల్లో విమర్శలను స్వీకరించే సహనం తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించిన వెంటనే వారి వెనుక ఏదో రాజకీయ ఉద్దేశం ఉందని ఆరోపించడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం, ప్రశ్నించిన వారి విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య సంస్కృతికి మంచిది కాదు. ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయాలను ప్రశంసించడం ఎంత అవసరమో, తప్పు నిర్ణయాలను విమర్శించడం కూడా అంతే అవసరం. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు విమర్శలను సహించలేకపోతే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు ప్రశ్నించే హక్కు కావాలని ఎలా కోరగలవు? ప్రజాస్వామ్యం అధికార పక్షానికి మాత్రమే సంబంధించిన వ్యవస్థ కాదు. అధికార పక్షం, ప్రతిపక్షం, మీడియా, పౌర సమాజం, సాధారణ ప్రజలు అందరికీ ఇందులో సమానమైన పాత్ర ఉంటుంది. ముఖ్యంగా ప్రతిపక్షం ప్రభుత్వాన్ని నిర్మాణాత్మకంగా ప్రశ్నించాలి. ప్రజా సమస్యలను సభల్లో ప్రస్తావించాలి. ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో ఎత్తిచూపాలి. అదే సమయంలో విమర్శలు వ్యక్తిగత దూషణలకు, నిరాధార ఆరోపణలకు పరిమితం కాకుండా వాస్తవాల ఆధారంగా ఉండాలి.ప్రజాస్వామ్య పరిరక్షణలో స్వేచ్ఛాయుత మీడియా పాత్ర కూడా అత్యంత కీలకం. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రభుత్వ నిర్ణయాలను విశ్లేషించడం, అవినీతి, అక్రమాలను బయటపెట్టడం మీడియా బాధ్యత. ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా నిలవాల్సిన మీడియా స్వతంత్రంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యానికి బలం చేకూరుతుంది. అయితే మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వార్తలను వాస్తవాల ఆధారంగా అందించాలి. వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు సామాజిక మాధ్యమాలు ప్రతి పౌరుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే వేదికగా మారాయి. ప్రభుత్వ విధానాలపై చర్చలు, ప్రజా సమస్యలపై నిరసనలు, అధికారుల దృష్టికి ఫిర్యాదులు తీసుకెళ్లడం వంటి అంశాలకు ఇవి ఉపయోగపడుతున్నాయి. అయితే తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు, వ్యక్తిత్వ హననం, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తాయి. కాబట్టి ప్రశ్నించే స్వేచ్ఛతో పాటు వాస్తవాలను తెలుసుకునే బాధ్యత, ఇతరుల అభిప్రాయాలను గౌరవించే సంస్కారం కూడా పౌరుల్లో ఉండాలి. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ప్రశ్నించే పౌరులు అవసరం. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించాలి. కుటుంబాల్లోనూ పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పే వాతావరణం ఉండాలి. సమాజంలో జరిగే అన్యాయాలను చూసి మౌనంగా ఉండకుండా స్పందించే పౌర చైతన్యం పెరగాలి. ఓటు వేయడం మాత్రమే పౌర బాధ్యత కాదు. ప్రభుత్వ పనితీరును గమనించడం, ప్రజా సమస్యలపై చర్చించడం, చట్టబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడటం కూడా ప్రజాస్వామ్య బాధ్యతలే. ప్రశ్నించే ప్రతి వ్యక్తిని శత్రువుగా చూసే పాలనలో ప్రజాస్వామ్య విలువలు బలహీనపడతాయి. విమర్శలను స్వీకరించి, తప్పులను సరిదిద్దుకుని, ప్రజలకు జవాబుదారీగా ఉండే పాలనలోనే అభివృద్ధికి నిజమైన అవకాశం ఉంటుంది. అధికారాలు శాశ్వతం కాదు.. పదవులు శాశ్వతం కాదు.. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజల హక్కులు శాశ్వతంగా నిలవాలి. అందుకే పాలకులు ప్రశ్నలకు సమాధానాలు చెప్పే సంస్కృతిని అలవర్చుకోవాలి. పౌరులు కూడా బాధ్యతాయుతంగా ప్రశ్నించాలి. ఎందుకంటే మౌనంగా ఉండే సమాజం కంటే ప్రశ్నించే సమాజమే ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంది. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం కాదు..వాటిని గౌరవించడం నేర్చుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

సహజ సాగు పద్ధతులపై రైతులకు కలెక్టర్ సూచనలు






- చాంద్‌పల్లిలో సీపీఎఫ్, ఉద్యానవన శాఖ అవగాహన కార్యక్రమం
- రైతు సాగు విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాజర్షిషా
- ఎరువు తయారీ, పంట నమోదు వివరాలపై ఆరా
- ఫుడ్ సెక్యూరిటీ, కన్సర్వేషన్ ప్రాజెక్టు పుస్తకం ఆవిష్కరణ

ఆదిలాబాద్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): బేల మండలం చాంద్‌పల్లి గ్రామంలో సీపీఎఫ్ సంస్థ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వ్యవసాయ పద్ధతులు, పంటల సాగుకు సంబంధించిన అంశాలపై రైతులు, అధికారులతో మాట్లాడారు.

కార్యక్రమానికి ముందు సీపీఎఫ్ సంస్థ సహకారంతో దర్గాజీ అనే రైతు సాగు చేస్తున్న పంటలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల సాగు విధానం, ఎరువుల తయారీ, పంట నమోదు ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతు అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతులపై అధికారులతోనూ చర్చించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. వ్యవసాయానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొక్కను నాటారు. రైతులు, గ్రామస్థులతో సమావేశమై కార్యక్రమం ఉద్దేశాలు, సాగు విధానాలకు సంబంధించిన అంశాలపై సూచనలు చేశారు.తదుపరి ఫుడ్ సెక్యూరిటీ, కన్సర్వేషన్ ప్రాజెక్టు పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. సీపీఎఫ్ సంస్థ సహకారంతో వ్యవసాయం చేస్తున్న దర్గాజీని ఈ సందర్భంగా సన్మానించారు. రైతు అనుభవాలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న సాగు విధానాలను పరిశీలించిన అనంతరం ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దిలీప్ కుమార్, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, ఎంపీడీఓ మహేష్‌కుమార్, ఎంఆర్ఓ ప్రవీణ్ కుమార్, ఎంఏఓ సాయి తేజ రెడ్డి, శాస్త్రవేత్తలు, సర్పంచ్ కోరంగే మంగళ, సీపీఎఫ్ సంస్థ డైరెక్టర్ గిరిజా, సంస్థ ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామస్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షకు ముగింపు ఎప్పుడు



- సమాన గౌరవం ఎప్పుడొస్తుంది?
- లింగమార్పిడి వ్యక్తుల హక్కుల కోసం పోరాటం
- హింస, అవమానాలు, వివక్షతో ఛిద్రమవుతున్న జీవితాలు
- విద్య, ఉపాధి, వైద్యంలో సమాన అవకాశాలు కల్పించాలి

డెస్క్, నవంబర్ 19 (తెలంగాణ ముచ్చట్లు): మనిషి పుట్టుకతోనే గౌరవంగా జీవించే హక్కును కలిగి ఉంటాడు. కులం, మతం, ప్రాంతం, భాష, లింగ భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. అయినప్పటికీ ఆధునిక ప్రపంచంలో కూడా కొందరు వ్యక్తులు తమ లింగ గుర్తింపు కారణంగా వివక్ష, అవమానాలు, హింసను ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిలో లింగ మార్పిడి వ్యక్తుల పరిస్థితి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు, గౌరవప్రదమైన జీవితం, విద్య, ఉపాధి, ఆరోగ్య సదుపాయాలు పొందేందుకు వారు నిరంతరం పోరాడాల్సి వస్తోంది. కుటుంబం నుంచి మొదలుకొని విద్యా సంస్థలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల వరకు వివక్ష ఎదుర్కొంటున్న సందర్భాలు అనేకం. కొన్నిసార్లు వారి ఉనికినే అంగీకరించని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో లింగమార్పిడి వ్యక్తులపై జరిగిన హింసను, వివక్షను గుర్తుచేసుకుంటూ, వారి హక్కుల పరిరక్షణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 20న అంతర్జాతీయ లింగమార్పిడి వ్యక్తుల స్మారక దినాన్ని నిర్వహిస్తారు. ఈ రోజు కేవలం మరణించిన వారిని స్మరించుకునే సందర్భమే కాదు.. సమాజంలో వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తే సందర్భం కూడా.

అంతర్జాతీయ లింగమార్పిడి వ్యక్తుల స్మారక దినం నిర్వహణకు 1998లో అమెరికాలో జరిగిన ఒక విషాద ఘటన నేపథ్యంగా నిలిచింది. లింగమార్పిడి వ్యక్తి రీటా హెస్టర్ హత్యకు గురైన ఘటన ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఆమె మరణం తర్వాత లింగమార్పిడి వ్యక్తులపై జరుగుతున్న హింస, దాడులు, వివక్షను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరాన్ని హక్కుల కార్యకర్తలు గుర్తించారు. ఈ క్రమంలో గ్వెన్ స్మిత్ సహా పలువురు కార్యకర్తలు 1999 నవంబర్ 20న రీటా హెస్టర్ జ్ఞాపకార్థం స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 20న ఈ దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా లింగమార్పిడి వ్యక్తులపై జరిగిన హత్యలు, దాడులు, బెదిరింపులు, వేధింపులను గుర్తుచేసుకుంటూ బాధితులకు నివాళులర్పిస్తున్నారు. హింసకు గురైన వారి జీవితాలను స్మరించుకోవడంతో పాటు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా సమాజంలో అవగాహన పెంచడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. లింగ గుర్తింపు కారణంగా ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకోవడం మానవ హక్కులకు విరుద్ధమనే సందేశాన్ని ఈ రోజు ప్రపంచానికి తెలియజేస్తోంది. లింగమార్పిడి వ్యక్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో కుటుంబ నిరాదరణ ఒకటి. చిన్న వయసులోనే తమ లింగ గుర్తింపు కారణంగా కొందరు పిల్లలు కుటుంబ సభ్యుల నుంచి అవమానాలు, ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. తమ పిల్లల భావాలను అర్థం చేసుకోవాల్సిన తల్లిదండ్రులే వారిని దూరం పెట్టడం వల్ల మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు ఇంటిని విడిచి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కుటుంబ ఆదరణ లేకపోవడం, చదువుకు దూరం కావడం, ఉపాధి అవకాశాలు లభించకపోవడం వారి జీవితాలను మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో తోటి విద్యార్థుల ఎగతాళి, అవమానాలు, వివక్ష కారణంగా చదువును మధ్యలోనే మానేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఉద్యోగాల కోసం ప్రయత్నించినప్పుడు లింగ గుర్తింపు కారణంగా అవకాశాలు నిరాకరించే ఘటనలు వారి ఆర్థిక స్వావలంబనకు అడ్డంకిగా మారుతున్నాయి. కొందరు తమ జీవనోపాధి కోసం అసురక్షిత పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోంది. సమాజంలో గౌరవంగా జీవించాలనే సాధారణ ఆకాంక్ష కూడా వారికి సవాలుగా మారడం బాధాకరం. ఒక వ్యక్తి లింగ గుర్తింపు ఆధారంగా అతడి సామర్థ్యాన్ని అంచనా వేయడం, అవకాశాలను నిరాకరించడం సరైన విధానం కాదు. కుటుంబాలు వారిని అంగీకరించి ఆదరించినప్పుడే వారి జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆరోగ్య సేవల విషయంలోనూ లింగ మార్పిడి వ్యక్తులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కొన్నిసార్లు వివక్ష, అవమానకర ప్రవర్తన ఎదురవుతోందనే ఫిర్యాదులు ఉన్నాయి. వారి ప్రత్యేక ఆరోగ్య అవసరాలను అర్థం చేసుకునే వైద్య నిబ్బంది, తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం అవసరం. మానసిక ఆరోగ్య సమస్యలు, సామాజిక ఒత్తిడి, ఒంటరితనం వంటి అంశాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారికి వైద్య సేవలు అందించేటప్పుడు గౌరవం, గోప్యత, వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇవ్వాలి. భారతదేశంలోనూ లింగమార్పిడి వ్యక్తుల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. 2014లో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పులో లింగమార్పిడి వ్యక్తుల స్వీయ లింగ గుర్తింపు హక్కును గుర్తించింది. అనంతరం 2019లో లింగమార్పిడి వ్యక్తుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ చట్టం వివక్షను నిషేధించడంతో పాటు విద్య, ఉపాధి, ఆరోగ్యం, ప్రజా సేవలు వంటి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ చట్టాలు ఉండటం మాత్రమే సరిపోదు. వాటి ప్రయోజనాలు అర్హులకు చేరేలా సమర్థంగా అమలు చేయాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి, గుర్తింపు పత్రాలు, విద్య, ఉద్యోగాలు, నివాస సదుపాయాలు పొందడంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించాలి.లింగమార్పిడి వ్యక్తుల పట్ల సమాజ దృక్పథంలో మార్పు వచ్చినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. వారిని వింతగా చూడటం, బహిరంగంగా అవమానించడం, ఎగతాళి చేయడం వంటి ప్రవర్తనలకు స్వస్తి చెప్పాలి. వ్యక్తి గౌరవం అతడి లింగ గుర్తింపుపై ఆధారపడి ఉండదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. పాఠశాల స్థాయి నుంచే లింగ సమానత్వం, మానవ హక్కులు, పరస్పర గౌరవం గురించి పిల్లలకు అవగాహన కల్పించాలి. ఉద్యోగ సంస్థలు వివక్షకు తావులేని వాతావరణాన్ని ఏర్పాటు చేసి, ప్రతిభ ఆధారంగా అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను మరింత విస్తరించి, విద్య, ఉపాధి, ఆరోగ్యం, గృహ వసతి వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వేధింపులకు గురైన వారికి న్యాయం అందేలా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. కుటుంబాలు తమ పిల్లలను అంగీకరించి అండగా నిలవాలి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in